సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం | 3 | నవంబర్ | 2024



ప్రోత్సహిస్తే సత్తా చాటుతాం
తమను ప్రోత్సహిస్తే క్రీడా పోటీల్లో సత్తా చాటుతామని అంటున్నారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడాకారులు. 8లో▸

నేడు జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు
ఆదిలాబాద్:ఎస్జీఎఫ్ అండర్–19 జోనల్‌స్థాయి బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి బాబురావు ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదువుతూ 19 ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు బోనఫైడ్, ఆధార్ ప్రతులతో పోటీలకు హాజరు కావాలని సూచించారు. ఉదయం 9గంటలకు స్టేడియంలో ఫిజికల్ డైరెక్టర్ యశోదరకు రిపోర్ట్ చేయాలని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0/21.0

వాతావరణం
చాలా వరకు ఎండగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

మెస్ చార్జీల పెంపుతో పేద విద్యార్థులకు మేలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

ఇచ్చోడ: పేద విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచిందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్తూ మార్గమధ్యలో మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలను శనివారం సందర్శించారు. గురుకుల, ఇతర వసతిగృహ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం కాస్మోటిక్, మెస్ చార్జీలను 45 శాతం పెంచినట్లు తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రోజారాణి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, తదితరులున్నారు.

మున్సిపల్ ఆర్‌వోకు కమిషనర్‌గా పదోన్నతి


జాదవ్ కృష్ణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారి (ఆర్‌వో)గా పనిచేస్తున్న జాదవ్ కృష్ణకు కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీల్లో రెవెన్యూ ఆఫీసర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న 19 మందికి కమిషనర్లుగా పదోన్నతి కల్పించగా మల్టీజోన్–1లో జాదవ్ కృష్ణకు పదోన్నతి లభించింది. ఆయనకు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డీఎంహెచ్‌వోగా నరేందర్ బాధ్యతలు

కైలాస్‌నగర్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి అధికారిగా నరేందర్ రాథోడ్ శనివారం కార్యాలయ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా పనిచేసిన కృష్ణ మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో పీవోడీటీటీగా పనిచేస్తున్న నరేందర్‌కు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయనకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

6న జాబ్ మేళా

ఎదులాపురం: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మిల్కా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ రంగంలో వేర్‌హౌస్ అసోసియేట్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, రిసెప్షనిస్ట్ ఉద్యోగాలకు సంబంధించి పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన జిల్లాలోని నిరుద్యోగ యువత అర్హులని వివరించారు. ఎంపికైన వారు మేడ్చల్‌లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9440586437 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచల గిరికి ప్రారంభించనున్న ప్రత్యేక బస్సు సర్వీసును భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9న మధ్యాహ్నం 12 గంటలకు అరుణాచల ప్రత్యేక సర్వీస్ డిపో నుంచి బయలుదేరుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో నవంబర్ 12న మధ్యాహ్నం 12 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.5వేలు, 12ఏళ్ల లోపు పిల్లలకు రూ.3,200 ఉంటుందని వివరించారు. 30 మంది భక్తులు ఉంటే తక్కువ ధరకే బస్సు అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 73828 42881, 99592 26002 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

సమగ్ర సర్వే

- ఇంటింటి కుటుంబ సర్వేకు యంత్రాంగం సిద్ధం
- ఎన్యూమరేటర్లుగా పీఎస్ హెచ్‌ఎంలు, టీచర్లు
- యజమాని, ఇతర వివరాలతో ప్రత్యేక స్టిక్కర్

సర్వే కోసం విభజన ఇలా..

గ్రామాలు, వార్డులు కలిపి సంఖ్య	: 1808
ఎన్యూమరేషన్ బ్లాక్స్ (ఈబీ)లు	: 1628
ఈబీలోని ఇళ్ల సంఖ్య	: 1,46,967


కుటుంబ వివరాల షెడ్యూల్ ఫామ్

సాక్షి,ఆదిలాబాద్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచార సేకరణకు గాను ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాలతో పాటు ఏకైక మున్సిపాలిటీని గ్రామాలు, వార్డుల వారీగా జాబితా సిద్ధం చేశారు. వాటి పరిధిలోకి వచ్చే ఇళ్ల సంఖ్యను గుర్తించారు. అక్కడి స్థితిగతులకు అనుగుణంగా విభజిస్తూ ఎన్యూమరేషన్ బ్లాక్స్(ఈబీ)లు ఏర్పాటు చేశారు. ప్రతీ ఈబీకి ఒక నంబర్ ఇవ్వడమే కాకుండా దానికి ఒక ఎన్యూమరేటర్‌ను నియమిస్తున్నారు. కొన్ని ఈబీలను కలుపుతూ బ్లాక్‌లుగా రూపొందించి ప్రతీ బ్లాక్‌కు ఒక సూపర్‌వైజర్‌ను కేటాయిస్తున్నారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ఈబీకి వెళ్లి సర్వే చేస్తారు. వారు సేకరించిన వివరాలను సూపర్‌వైజర్‌కు అందజేస్తారు. ఇలా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఒక ప్రణాళికాబద్ధంగా సాగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది.

పదేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సర్వే అప్పట్లో ఒకే రోజు నిర్వహించారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు సిద్ధమైంది. కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఇది సాగనుంది. దీనికి సంబంధించి ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు సర్వేకు సమాయత్తమవుతున్నారు. ఇది ఈనెల 6న ప్రారంభమై 18వ తేది వరకు కొనసాగనుంది. ఆ తర్వాత డాటా ఎంట్రీ చేపట్టనున్నారు. ఈ నెల చివరి వరకు మొత్తం ప్రక్రియ పూర్తి కావాలి.

ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులు..
సర్వే మొదలుపెట్టే ముందు ప్రభుత్వం ప్రతీ గ్రామం, పట్టణంలోని వార్డుల వారీగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లోని ప్రతి ఇంట్లో ఒక స్టిక్కర్ అతికించే కార్యక్రమం శుక్రవారం మొదలు పెట్టారు. అయితే ప్రభుత్వం ముందుగా ఎన్యూమరేటర్లుగా అంగన్‌వాడీలు, ఆశాలు, ఇతరులను నియమించారు. తాజాగా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఈ సర్వే చేయాలని నిర్ణయించారు. దీంతో ఇంటింటికి స్టిక్కర్ అంటించే కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసి 6వ తేదీకి మార్చారు. ఇదిలా ఉంటే ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా గుర్తించే ప్రక్రియ మొదలైంది. 4వ తేదీ నుంచి వారికి శిక్షణ ఇవ్వనున్నారు. 6వ తేదీన సర్వే ప్రారంభం అవుతుంది. ఆ స్టిక్కర్‌లో ఇంటి యజమాని పేరుతో పాటు ఇంటి నంబర్, ఏ ఈబీ పరిధిలోకి వస్తుంది అనే వివరాలు అందులో పొందుపరుస్తారు. అలాగే ఎన్యూమరేషన్ చేసిన తేదీని ఎన్యూమరేటర్ ఆ ఇంటి సర్వే పూర్తయిన తర్వాత దానిపై రాయాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే సూపర్‌వైజర్లుగా ఇప్పటికే మండల, పట్టణ అధికారులను నియమించారు. మరి వారినే కొనసాగిస్తారా లేదా అనేది చూడాల్సిందే.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి ప్రభుత్వం రెండు పార్ట్‌లను రూపొందించింది. పార్ట్–1లో కుటుంబ యజమానికి సంబంధించి వివరాలతో పాటు కుటుంబ సభ్యుల సమాచారం నమోదు చేయనున్నారు. దివ్యాంగులు ఎవరైనా ఉంటే వారికి సంబంధించిన సమాచారం, వైవాహిక స్థితిని కూడా పొందుపరుస్తారు. అలాగే ఉద్యోగ, ఉపాధి, ఆదాయం వివరాలతో పాటు ఐటీకి సంబంధించిన వివరాలు కూడా నమోదు చేయనున్నారు. అంతేకాకుండా కుటుంబానికి ఉన్న భూముల వివరాలు సైతం సేకరించనున్నారు. ఒకవేళ కౌలు ద్వారా పంట సాగు చేసి ఉంటే దానికి సంబంధించిన వివరాలు కూడా నమోదు చేయనున్నారు. రిజర్వేషన్, దానికి సంబంధించిన ప్రయోజనాలు, ఇతర వివరాలు కూడా సేకరించనున్నారు. రాజకీయ నేపథ్యం కూడా ఈ సర్వేలో సేకరించడం ప్రాధాన్యత సంతరించుకోనుంది. పార్ట్–2లో కుటుంబానికి ఉన్న అప్పులు, ఏ అవసరం నిమిత్తం తీసుకున్నారు.. ఎక్కడి నుంచి పొందారు లాంటి వివరాలతో పాటు పశు సంపద వివరాలు, ఇతరత్రా వివరాలు కూడా నమోదు చేయనున్నారు. మొత్తంగా రెండు పార్ట్‌లలో కలిపి 56 అంశాల్లో 75 ప్రశ్నలతో ఈ ఫాం ఉంటుంది. ఒక్కొక్క ఇంటికి సంబంధించి కుటుంబ వివరాల షెడ్యూల్ కోసం దీనిని సిద్ధం చేశారు.

56 అంశాల్లో..

పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు..
జిల్లాలోని ప్రతీ కుటుంబానికి సంబంధించిన సర్వేను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏ ఒక్క నివాస గృహం సైతం తప్పిపోకుండా చూస్తున్నాం. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని ఎన్యూమరేటర్లను ఆదేశించాం. ప్రజలు కూడా సహకరించాలి. – రాజర్షిషా, కలెక్టర్

ఒక రిజిస్ట్రేషన్ రద్దు

- మిగతా మూడింటిపై కూడా త్వరలో చర్యలు
- 'నకిలీ ఎల్‌ఆర్‌ఎస్' వ్యవహారంలో అధికారుల స్పందన
- క్రిమినల్ కేసు నమోదుకు కలెక్టర్ ఆదేశం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


సాక్షిలో ప్రచురితమైన కథనం

కైలాస్‌నగర్: నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్ సృష్టించి అక్రమ లేఅవుట్‌ను రిజిస్ట్రేషన్ చేసిన వైనాన్ని వివరిస్తూ 'నకిలీ ఎల్‌ఆర్‌ఎస్‌తో రిజిస్ట్రేషన్' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాజర్షి షా స్పందించారు. అక్రమ ఎల్‌ఆర్‌ఎస్ జరిగిన తీరుపై మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులను ఆరా తీసినట్లుగా తెలిసింది. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. ఇక 'సాక్షి' కథనంతో కదిలిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత, టీపీఎస్ నవీన్‌కుమార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ రావు, సబ్‌రిజిస్ట్రార్–2 ప్రవీణ్‌కుమార్ శనివారం ఆదిలాబాద్ రూరల్ పోలీసులను సంప్రదించారు. వేర్వేరుగా వెళ్లిన ఆయా శాఖల అధికారులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ సృష్టించి అధికారులను తప్పుదోవ పట్టించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా అక్రమంగా జరిగిన నాలుగు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లలో ఒక రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లుగా సబ్ రిజిస్ట్రార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మిగతా మూడు డాక్యుమెంట్లను సైతం రద్దు చేసేలా చర్యలు చేపట్టామని, సోమవారం వరకు వాటిని క్యాన్సల్ చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాయిద్‌ను 'సాక్షి' సంప్రదించగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, కేసు వివరాలు తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ రూపొందించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డాక్యుమెంట్ రైటర్స్ సైతం ఆందోళన చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి చర్యలు తీసుకోవాలని కోరారు.


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన
కైలాస్‌నగర్: నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్ సృష్టించి లేఅవుట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డాక్యుమెంట్ రైటర్స్, రియల్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శనివారం వారు ఆందోళనకు దిగారు. నాయకులు ఖదీర్, వేదవ్యాస్ మాట్లాడుతూ.. అక్రమ ఎల్‌ఆర్‌ఎస్‌కు డాక్యుమెంట్ రైటర్స్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఓ ప్రైవేట్ వ్యక్తి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఎల్‌ఆర్‌ఎస్ బోగస్ డాక్యుమెంట్ సృష్టించారన్నాడు. అధికారులు సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పశుగణనకు శ్రీకారం


అక్టోబర్ 25న తలమడుగు మండలంలో పశుగణన ప్రారంభిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారి

- గతనెలలోనే ప్రక్రియ ప్రారంభం
- ఇంకా అందుబాటులోకి రాని యాప్
- త్వరలోనే క్షేత్రస్థాయి సర్వే

కైలాస్‌నగర్: ప్రతీ ఐదేళ్లకోసారి నిర్వహించే జాతీయ పశుగణనకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్యూమరేటర్లతో పాటు సూపర్‌వైజర్లను నియమించి వారికి శిక్షణ సైతం అందజేసింది. గత నెల 25న దేశవ్యాప్తంగా పశుగణనకు శ్రీకారం చుట్టగా జిల్లాలో తలమడుగు మండలంలో ప్రారంభించారు. అయితే వివరాల నమోదుకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక యాప్ అందుబాటులోకి రాలేదు. దీంతో క్షేత్రస్థాయి సర్వే ఇంకా షురూ కాలేదు. యాప్ అందుబాటులోకి వచ్చిన వెంటనే గణన ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఉద్దేశమేంటంటే..
పాడి, గుడ్లు, మాంసం ఉత్పత్తి ఏ విధంగా ఉందనే వివరాలు తెలుసుకోవడంతో పాటు పాడి పరిశ్రమ వృద్ధికి భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దాన్ని గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఐదేళ్ల కోసారి పశుగణన కార్యక్రమాన్ని చేపడుతుంది. గతంలో 2019లో ఈ సర్వే నిర్వహించారు. పెంపకందారులతో పాటు రైతులకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ సర్వే దోహదపడనుంది.

త్వరలోనే క్షేత్రస్థాయిలోకి...
21వ పశుగణన–2024కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసి ఆదేశాలకనుగుణంగా జిల్లా పశుసంవర్ధకశాఖ కసరత్తు చేపట్టింది. గోపాల మిత్రలు, వెటర్నరీ, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారులు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్ వంటి 57 మందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. వీరిని పర్యవేక్షించేందుకు 13 మంది మండల పశు వైద్యాధికారులను సూపర్‌వైజర్లుగా నియమించారు. గత నెల 25న పశుగణన కార్యక్రమాన్ని జిల్లాలోని తలమడుగు మండలం భరంపూర్ గ్రామంలో ప్రారంభించారు. అయితే మూగజీవాల సమాచారం నమోదు కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ఇంకా అందుబాటులోకి రాలేదు. వచ్చిన వెంటనే సర్వే ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రైతులకు సంబంధించిన ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులు, కుందేళ్లు, బాతులు, గుర్రాలు, కుక్కలు, పక్షులు వంటి ఇతరత్రా మూగజీవాల సమాచారం సేకరించనున్నారు. పెంపకందారుల వివరాలు నమోదు చేయనున్నారు.

సమగ్ర సమాచారం అందించాలి



పశు పెంపకందారులకు అవసరమైన చేయూత అందించడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఐదేళ్లకోసారి జాతీయ పశుగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సర్వే కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశాం. యాప్ అందుబాటులోకి వచ్చిన వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభిస్తాం. ఇళ్లవద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు పెంపకందారులు సమగ్ర సమాచారం అందించి సహకరించాలి.– బి.కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

- జిల్లాలో మూడు కేంద్రాలు
- వీసీలో కలెక్టర్ రాజర్షి షా వెల్లడి

కైలాస్‌నగర్: జిల్లాలో మూడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట, దంతన్‌పల్లి, శాంతినగర్ గ్రామాల్లో వీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం హైదరాబాద్ సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఐకేపీ ద్వారా వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3వ వారంలో మూడు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో 3,400 మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చనే అంచనా ఉందన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

గ్రేడ్–ఏ రకానికి రూ.2,320, కామన్ గ్రేడ్ రకానికి రూ.2,300 కనీస మద్దతు ధరగా చెల్లించనున్నట్లు తెలిపారు. అలాగే సన్నరకానికి రూ.500 బోనస్‌గా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్‌వో వాజీద్ అలీ, సివిల్ సప్లై డీఎం సుధారాణి, డీఏవో శ్రీధర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి లక్ష్యాలను సాధించాలి
కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం లక్ష్యాలను ఈనెలాఖరులోపు సాధించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాలో పథకం అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో తన చాంబర్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యాలు, సాధించిన ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తిని అమలు చేస్తుందన్నారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖారులోగా రుణ లక్ష్యాలను సైతం సాధించాలన్నారు. ఇందులో డీఆర్డీవో సాయన్న, ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజు, పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ ఉద్యమంలో భాగస్వాములవ్వాలి


మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్: స్కౌట్స్ ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అసోసియేషన్ చీఫ్ కమిషనర్, డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం ఏర్పాటు చేసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. నూతన యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ కార్యక్రమాల నివేదికను జిల్లా కార్యదర్శి ఎస్.స్వామి వివరించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు రత్నాకర్, ఉదయశ్రీ, కోశాధికారి కే.మోహన్ బాబు, జిల్లా కమిషనర్లు జయశీల, మహేశ్, శాస్త్రీ, సంయుక్త కార్యదర్శి జి.లక్ష్మి, ట్రైనింగ్ కమిషనర్లు నాగిరెడ్డి, వినోద్ రెడ్డి, స్నేహ కుమారి, సిద్ధేశ్వరి, గైడ్ కెప్టెన్లు భాగ్యలక్ష్మి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో అటవీశాఖ అధికారులు శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటుగా ఓ వాహనం వచ్చింది. దానిని ఆపి తనిఖీ చేయగా.. అందులో పీడీఎస్ బియ్యం కనిపించాయి. డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తిని బియ్యం ఎక్కడివని ప్రశ్నించారు. వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకుని బియ్యాన్ని సీజ్ చేశారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్‌సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కార్తీక్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని దాబా హోటల్‌లో పనిచేసే వంటమనిషి నందుగౌడ్ (40) శనివారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్ర కారం.. గ్రామానికి చెందిన దాబా హోటల్‌లో నందుగౌడ్ వంటమనిషిగా పనిచేస్తున్నాడు. అతని స్వగ్రామం మహారాష్ట్రలోని కిన్వట్ తా లూకా తలారి. యజమాని సూచన మేరకు పాత దాబా నుంచి సమీపంలోని కొత్త దా బాకు కాలినడకన సామగ్రిని తరలిస్తున్న క్ర మంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వె ళ్లిపోయింది. స్థానికులు దాబా యజమాని గణేశ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే నందుగౌ డ్‌ను నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి 108లో తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. నందుగౌడ్‌కు భార్య, ముగ్గురు కూతు ళ్లు ఉన్నారు. ఈ ఘటనలపై తమకు ఫిర్యాదు అందలేదని ఏఎస్సై వసంత్ తెలిపారు.

రోడ్డు పనులను అడ్డుకున్న అటవీ అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని రాజులమడుగు నుంచి జిల్లెడికుంట వరకు చేపట్టిన మట్టిరోడ్డు పనులను అటవీశాఖ అధికారులు శనివారం అడ్డుకున్నారు. రోడ్డు పనులకు అటవీ అనుమతులు తీసుకోవాలని సత్తన్‌పల్లి ఎఫ్‌బీవో అనుపమ గ్రామస్తులకు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు.. మాడావి అంకుశ్‌రావు, లింగు, మారుతి, మోహన్ తదితరులు మాట్లాడారు. మారుమూల అటవీ ప్రాంతంలోని తమకు ఉన్న పాతరోడ్డు వర్షకాలంలో కొట్టుకుపోయిందని, గుంతలు పడడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. గతంలోనూ మట్టి రోడ్డు నిర్మించుకున్నామని, అప్పుడు అనుమతులు తీసుకోలేదని తెలిపారు. ఇప్పుడు కొత్తగా అనుమతుల పేరుతో పనులు ఆపడం సరికాదన్నారు. తాము అటవీ భూముల్లో తవ్వకాలు చేయడం లేదని, ఆక్రమణలు చేపట్టడం లేదని తెలిపారు. అనంతరం రోడ్డు పనులు చేపట్టారు. కార్యక్రమంలో సోమర్‌పేట్ ఎఫ్‌బీవో నారాయణ పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే సత్తా చాటుతాం

- రవాణా చార్జీలు కూడా చెల్లించడం లేదు
- అండర్–14 ఖోఖో క్రీడాకారుల ఆవేదన



మండల కేంద్రంలో ఖోఖో ఆడుతున్న బాలికలు

లక్ష్మణచాంద: తమను ప్రోత్సహిస్తే క్రీడా పోటీల్లో సత్తా చాటుతామంటున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడాకారులు అంటున్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అండర్–14 బాలికల జోనల్‌స్థాయి జట్టు ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా పరిధిలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో పాల్గొని సత్తా చాటిన 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు మరో ఐదుగురు క్రీడాకారులను స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 17 మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు. లక్ష్మణచాంద ప్రభుత్వ పాఠశాలలో వసతులు భాగున్నాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లడమే ఇబ్బందిగా ఉందని తెలిపారు. ప్రభుత్వం తమకు కనీసం రవాణా చార్జీలు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. క్రీడా దుస్తులు, షూస్, రవాణా చార్జీలు అన్నీ తామే భరిస్తున్నామని పేర్కొన్నారు.

వసతులు బాగున్నాయి



లక్ష్మణచాందలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇక్కడ వసతులు బాగున్నాయి. స్థానిక దాతలు క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉంది.

– శ్రీనిధి, ఆదిలాబాద్ జిల్లా

చేయూతనివ్వాలి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చాలామంది విద్యార్థులు వివిధ రకాల క్రీడల్లో నైపుణ్యం ఉన్నా ఖర్చులు భరించలేక పోటీలకు దూరమవుతున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులే భరించాల్సి వస్తోంది. ప్రభుత్వం చూయూతనివ్వాలి.

– కృష్ణ, పీడీ, ఆష్ట ప్రభుత్వ పాఠశాల

సొంత ఖర్చులతోనే పోటీలకు..



ఎక్కడ పోటీలు జరిగినా తమ సొంత డబ్బులతోనే అక్కడకు వెళ్లాల్సి వస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆటలపై ఉన్న ఇష్టంతోనే ఆర్థిక ఇబ్బందులు ఎదరైనా వెళ్తున్నాం. ప్రభుత్వం కనీసం రవాణా చార్జీలు చెల్లించాలి.

– నాగేశ్వరి, ఆసిఫాబాద్ జిల్లా

దాతలు ముందుకు రావాలి



క్రీడాకారులకు దాతలు అండగా నిలవాలి. రవాణా, క్రీడా దుస్తులు, షూష్, స్పోర్ట్స్ కిట్స్ అందించాలి. దాతలు, ప్రభుత్వ సహకారం ఉంటే.. పోటీల్లో మరింత సత్తా చాటుతాం. పతకాలు సాధిస్తాం.

– అంజలి, నిర్మల్ జిల్లా

క్రీడాదుస్తులు అందజేయాలి



వివిధ ప్రాంతాల్లో ఖోఖో ఆడటానికి వెళ్లే క్రీడాకారులకు అవసరమైన క్రీడా దుస్తులు, షూస్‌తోపాటు ఇతర అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలి. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– సరోజ, ఆసిఫాబాద్ జిల్లా

బాలుడి అనుమానాస్పద మృతి



లాల్‌షావ్ మృతదేహం

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ పంచాయతీ పరిధి అనంతపూర్ గ్రామంలో బాలుడు అనుమానాస్పద స్థితిలో బావిలో పడి శనివారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తొడసం నాగోరావ్–ఇస్రుబాయి దంపతుల చిన్న కుమారుడు లాల్‌షావ్(11) మండలంలోని వడగామ్ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం చేనులో ఉన్న ఎడ్లను తీసుకురావాలని తండ్రి చెప్పడంతో అక్కడికి వెళ్లిన లాల్‌షావ్ రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. సమీప చేలతోపాటు అటవీ ప్రాంతంలో గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం సమీప బావిలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. ఎస్సై సునీల్ ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. తన కుమారుడికి ఈత వస్తుందని, మృతిపై అనుమానం ఉందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంత రం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.



లాల్‌షావ్ (ఫైల్)

కోడిపందేల స్థావరాలపై దాడులు

కోటపల్లి: మండలంలోని సుపాక గ్రామ శివారు ప్రాణహిత నది వద్ద కోడిపందేల స్థావరాలపై దాడి చేసి 11మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మూడు కోడిపుంజులు, 9 సెల్‌ఫోన్లు, రూ.16810 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోడిపందేలు, పేకాటపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చేదం తిరుపతి(26) మృతిచెందాడు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. దేవాపూర్ నాయకపుగూడకు చెందిన తిరుపతి మోటార్‌సైకిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. తెల్లవారు జామున సమీపంలోని చింతగూడ నుంచి దేవాపూర్‌లోని తన ఇంటికి మోటార్‌సైకిల్‌పై వస్తూ లారీ యార్డు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి చేదం రాజక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడి తండ్రి చిన్నయ్య, సోదరులు వెంకటేష్, ఆంజనేయులు గతంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఉన్న ఒక్క కొడుకూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లి ఒంటరైంది.



తిరుపతి(ఫైల్)

ఏటీఎం చోరీకి విఫలయత్నం

- 100కు సమాచారం అందించిన మేనేజర్
- రెడ్ హ్యాండెడ్‌గా దొంగను పట్టుకున్న పోలీసులు



నిందితుడిని పట్టుకున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లేన్‌లో ఉన్న కెనరా బ్యాంక్ ఏటీఎంలో ఓ వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. పట్టణ పోలీసులు రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి బ్యాంక్ ఏటీఎంలో ఓ వ్యక్తి వచ్చాడు. అదే సమయంలో బ్యాంకు మేనేజర్ తన బ్యాంకు, ఏటీఎం సీసీ కెమెరాలను సెల్‌ఫోన్‌లో తనిఖీ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏటీఎంకు వచ్చిన వ్యక్తి డబ్బులు తీసుకోకుండా ఏటీఎంను పగులగొట్టేందుకు యత్నిస్తున్నట్లు గుర్తించాడు. వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. వెంటనే పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. ఇన్‌స్పెక్టర్ అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో గాలించగా.. దొంగ దొరికాడు. అతడిని వెల్మల్ బొప్పారం గ్రామానికి చెందిన కుంచం గంగాధర్‌గా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. దొంగతనాన్ని అడ్డుకున్న ఇన్‌స్పెక్టర్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

తనిఖీల్లో వాహనాలు సీజ్



వాహనాల తనిఖీలు చేపడుతున్న రవాణా శాఖా అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా రవాణా శాఖా ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల జిల్లా శివారు ప్రాంతాలతోపాటు శ్రీరాంపూర్, ఇందారం, ఓపెన్ కాస్ట్ గనుల పరిసర ప్రాంతాల్లో భారీ, మధ్య తరహా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఇంచార్జీ డీటీఓ రంజిత్‌రెడ్డి, ఎంవీఐ కిషోర్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 30 భారీ, మధ్య తరహా వాహనాలను తనిఖీ చేశారు. ఆరు భారీ వాహనాలు టాక్స్‌లు చెల్లించకుండా తిరుగుతుండగా, మరికొన్ని వాహనాలు ఫిట్‌నెస్, ఓవర్ లోడ్, తదితర కారణాలతో రోడ్లపై తిరుగుతున్నాయని గుర్తించి సీజ్ చేసి, జరిమానా విధించారు. జరిమానాల రూపంలో రవాణా శాఖకు రూ.3లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య



మృతురాలు భారతీభాయి

కుభీర్: మండలంలోని న్యూసాంవ్లి గ్రామానికి చెందిన కొత్తిమీర భారతీబాయి(32) భర్త, మరిది వేధింపులు భరించలేక శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భారతీబాయికి నూసాంవ్లి గ్రామానికి చెందిన దయానంద్‌తో 14 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి 12 ఏళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. దంపతులిద్దరూ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ పిల్లలను పోషిస్తున్నారు. ఇటీవల మద్యానికి బానిసైన దయానంద్ పని మానేసి నిత్యం తాగొచ్చి గొడవ పడుతున్నాడు. దయానంద్ తమ్ముడు కూడా అన్నకు వత్తాసు పలికేవాడు. దీంతో మనస్తాపం చెందిన భారతీబాయి.. శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఉరేసకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రవీందర్ ఘటన స్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. భారతీబాయి సోదరుడు సాంగే ప్రకాశ్ ఫిర్యాదు మేరకు భర్త దయానంద్, మరిది కీర్తి రతన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య, అత్తింటివారు వేధిస్తున్నారని...

లక్ష్మణచాంద: భార్య, అత్తింటివారి వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిర్పెల్లిలో జరిగింది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం ఇక్బాల్‌పూర్‌కు చెందిన పల్లపు పెద్దులు(35)కు తిర్పెల్లి గ్రామానికి చెందిన గంగజమునతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్లుగా పెద్దలు తిర్పెల్లి గ్రామంలోనే భార్య, పిల్లలతో ఉంటున్నాడు. వ్యవసాయ కూలీగా పనిచేస్తూ భార్య, పిల్లలను పోషించుకుంటున్నాడు. అయితే కొన్ని రోజులుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో అత్తింటివారు కూడా జోక్యం చేసుకున్నారు. పెద్దులును బెదిరించారు. శుక్రవారం కూడా గొడవ జరగడంతో మనస్తాపం చెందిన పెద్దులు శుక్రవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో గంగజమున పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున గ్రామ శివారులో ఓ చెట్టుకు పెద్దులు ఉరేసుకుని కనిపించాడు. దీంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించింది. అందులో భర్త, అత్తింటివారి వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నాడు. దీంతో పోలీసులు ఈ సూసైడ్ నోట్, పెద్దులు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆత్మహత్యకు కారకులైనవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భార్య మందలించిందని..



నాగోరావ్ (ఫైల్)

తానూరు: భార్య మందలించిందని మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన గాడేకర్ నాగోరావ్(50) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోరావ్ కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని భార్య వందన తరచూ మందలిస్తోంది. గురువారం తాగొచ్చిన భర్తను మందలించింది. దీపావళి పండగ నేపథ్యంలో కుభీర్ మండలం బెల్‌గాంలోని పుట్టింటికి వెళ్లింది. అదే రోజు రాత్రి నాగోరావ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. శనివారం భార్య వందన నాగోరావ్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో పక్కింటి వారికి ఫోన్ చేసి భర్తను పిలవాలని కోరింది. వారు వెళ్లి చూడగా నాగోరావ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. విషయం భార్యకు చెప్పి.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘనట స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. వందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. నాగోరావ్‌కు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నకిలీ మొక్కజొన్న విత్తనాలు పట్టివేత

- పోలీస్ స్టేషన్‌లో ఏఈవో ఫిర్యాదు
- నిందితుడికి రిమాండ్



నకిలీ మొక్క జొన్న విత్తనాలతో చందుల మహేశ్(టక్ వేసుకున్న వ్యక్తి)

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కె) ఎక్స్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న నకిలీ మొక్కజొన్న విత్తనాలను ఏఈవో గణేశ్ పట్టుకున్నారు. కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన చందుల మహేశ్ శనివారం ద్విచక్రవాహనంపై మూడు సంచుల్లో పయనీర్ మొక్కజొన్న హైబ్రిడ్–పీ 3546 నంబరు గల 30 విత్తనాల ప్యాకెట్లను తరలిస్తున్నట్లు ఏఈవోకు సమాచారం అందింది. దీంతో తనిఖీ చేయగా విత్తనాలకు సంబంధించిన ఎలాంటి రశీదులు చూపలేదు. పయనీర్ కంపెనీ వ్యక్తి వచ్చి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా వివరాలు రాలేదు. దీంతో నకిలీ విత్తనాలుగా నిర్ధారించారు. ఒక్కో సంచిలో 10 విత్తన ప్యాకెట్ల చొప్పున మూడు సంచుల్లో 30 ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ 4 కేజీల బరువు, ధర రూ.2,392 ఉందని తెలిపారు. విత్తనాల విలువ రూ.71,760 వరకు ఉంటుందని తెలిపారు. నకిలీ విత్తనాలను రైతులకు అధిక లాభాలకు అమ్మి మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఏఈవో గణేశ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ఖోఖో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ఎంపిక



అండర్–14 ఖోఖో జట్టు బాలికలతో తహసీల్దార్ జానకి

లక్ష్మణచాంద: ఖోఖో ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల జట్టు ఎంపిక పోటీలు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించారు. పోటీలను తహసీల్దార్ జానకీ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని సూచనలు చేశారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులుకు సూచించారు. అనంతరం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, సెలక్షన్ కమిటీ సభ్యులు కృష్ణ, రాము రాంజీ, మల్లేశ్, ఎంపీడీవో రాధ, నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, ఎంఈవో అశోక్‌వర్మ, ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, ఉపాధ్యాయులు అశోక్, శ్రీనివాస్, వీడీసీ సభ్యులు నగేష్, రాంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్–14 ఉమ్మడి జిల్లా జట్టు..

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు నిర్మల్ జిల్లా నుంచి పి.అంజలి, శ్రీనిధి, నవీన, కీర్తన, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి నాగేశ్వరి, సరోజ, వైష్ణవి, శ్రీలత, అశ్విని, ఆదిలాబాద్ జిల్లా నుంచి అక్షయ అనూష, మంచిర్యాల జిల్లా నుంచి ఆలియా మహావీన్, స్టాండ్‌బైగా రక్షిత, సోనాలి, శ్రీనిత్య, హర్షిత, గీతాంజలి ఎంపికయ్యారు.

జోనల్‌స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు



పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్–19 ఖోఖో జోనల్ స్థాయి ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం నిర్వహించారు. పోటీలను తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల(బాలుర) ప్రిన్సిపాల్ అనిల్ కాంబ్లే ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన వారు ఈనెల 7నుంచి 9వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఇందులో వైస్ ప్రిన్సిపాల్ గోవర్ధన్, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, పీఈటీ ప్రతాప్, మహేశ్, అతుల్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



హ్యాండ్‌బాల్ ఆడుతున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పా ఠశాలలో శనివారం 38వ రాష్ట్రస్థా యి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీపీ మ ల్లికార్జున్, అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిగొప్పుల సదానందం స్మారకార్థం నిర్వహిస్తున్న పోటీల్లో రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మొదటిరోజు జరిగిన పోటీల్లో ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా జట్టు నిజామబాద్, ఖమ్మం జట్లపై విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, హ్యాండ్‌బాల్ రాష్ట్ర రెఫరీ బోర్డు కన్వీనర్ ఇంద్ర సేనారెడ్డి, కోచ్‌లు అరవింద్, విద్యాసాగర్, తిరుమల్, పాల్గొన్నారు.

చదువుల తల్లిని ఆదుకోండి


- నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు
- గిరిజన విద్యార్థినికి ఆర్థిక కష్టాలు



శిరీష

నెన్నెల: చదువుల తల్లిని ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించినా బుక్స్, హాస్టల్ ఫీజుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూలీ పనులు చేసి రెక్కల కష్టంపై ఎలాగోలా తల్లిదండ్రులు ప్రభుత్వ గిరిజన విద్యాలయంలో ఆమెను చదివించారు. ఆమెలోని ప్రతిభతో డాక్టర్ కావాలన్న దిశగా పయనిస్తోంది. కానీ ఆర్థిక స్థితిగతులు ముందడుగు వేయనివ్వడం లేదు. డాక్టర్ చదువు కోసం కనీసం ఫీజు కూడా కట్టలేని స్థితిలో ఆ కుటుంబం ఉంది. కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామానికి చెందిన మానేపల్లి పెంటయ్య, లక్ష్మి అనే గిరిజన నిరుపేద దంపతుల కూతురు శిరీషకు డాక్టర్ కావాలన్న కోరిక. నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించి భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కాలేజీలో దాతల సాయంతో అడ్మిషన్ తీసుకుంది. బుక్స్, హాస్టల్ ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతోంది. దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటోంది. విద్యార్థినికి సాయం చేయాలనుకునే వారు 9392673867 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం అందించగలరు.

ఏక్ పోలీస్ వ్యవస్థ అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న గణేశ్, ఇతర నాయకులు

- తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఏక్ పోలీస్ వ్యవస్థను అమలు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. మావల మండలం కుమురంభీం గూడలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏక్ పోలీస్ వ్యవస్థను అమలు చేయాలని కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బెటాలియన్లలోని పోలీసులు కోరుతున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పోలీసుల న్యాయమైన పోరాటానికి తుడుందెబ్బ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, నాయకులు ప్రకాశ్, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.